# కాలం మారిపోయింది

## శ్రీ కాసల నాగభూషణం

"ఇంక మనం వెళదామా ?" అంటూనే నా భుజంమీద చెయ్యి మోపి, నిటారుగా లేచి, కపిలతీర్థం గుడివేపు చూస్తూ నిలుచున్నాడు రాంబాబు.

"అప్పుడేనా! వెన్నెలరానీ" అని నేను వాని చేతిని పట్టుకుని ఒక్క కుదుపుతో కిందికి లాగాను. ఇసుకలో దబ్బున కూలబడ్డాడు రాంబాబు.

అప్పటి వేళావిశేషమేమోకాని తన మాటని చెల్లించుకోవాలనే పట్టుదలతో తొందరగా వెళదాం రమ్మని వాడు నాతో పేచీ పెట్టుకోలేదు. మనసులో నన్ను తిట్టుకున్నా ఎదుటికిమాత్రం బుద్ధిగా కూచుని చిన్నపిల్లాడిలా ఇసుకని కొంతమేర పోగుచేసి ఓ మోస్తరు రాళ్లనేరి దాని చుట్టూరా కోటలా పేర్చుకుంటోన్నాడు.

వాణ్ని చూసి ఒక్కమారు నాలోనేనే నవ్వుకుని, పడమటి దిక్కుగా అస్తమిస్తోన్న సూర్యుడికేసి చూపు ప్రసరించాను.

అలా చూస్తోండగానే సూర్యుడు ఎర్రగా మారాడు.

పడమటి కొండలమీది మబ్బుల చివర్లలో చిక్కుకున్న ప్రభాకరుని పచ్చని కిరణపుంజం సన్నని జరీ అంచులా నిగనిగలాడుతోంది. మరి కాసేపటికి పరిణతమైన సూర్య కిరణాలతో ప్రకృతి పసుపు రంగులోకి మారింది. నింగి నేలని తాకుతోన్నచోట్లల్లా నీలిమ ఎక్కువవుతోంది. మబ్బులు చీకటి ముద్దల్లా తయారవుతోన్నాయి.

ఒళ్లంతా పసుపు రాసుకుని, తలంటుపోసుకుని కురులారబెట్టుకుంటోన్న పడుచుపిల్లలావుంది సంధ్య! నాకు తెలియని ఆనందంతో అలానే చూస్తోండిపోయాను సంధ్యకేసి!

"ఓ...శర్మగారా! రండి...రండి..." రాంబాబుకంఠంవిని, తలతిప్పి వానివైపు తిరిగాను.

"ఏమిటి ? ఇక్కడ కూచున్నారు ఏకాంతంగా" మా ఇద్దరినీ సమీపిస్తూ ఒక వయస్సు మళ్లిన వృద్ధుడు నవ్వుతూ ప్రశ్నించాడు రాంబాబుని.

"ఏకాంత మేమిటండీ ? ఇక్కడున్నది ఇద్దరూ మొగపిల్లలైతే."

ఇదీ రాంబాబు సమాధానం. ఒకవేళ ఆ వున్నది ఇద్దరే అయినా ఆడా మగా అయితే అది ఏకాంతమే అని అందులో వాడి ధ్వని!

మొత్తానికి ముసలాయన దగ్గర రాంబాబుకి చాలా చనువున్నట్టే గ్రహించాను.

మాతో వొచ్చి కూచున్న తర్వాత అతనికి నన్ను చూపెడుతూ నాపేరు చెప్పి పరిచయం చేశాడు రాంబాబు.

నేనతనికి నమస్కరించాను.

"ఈయనపేరు సుబ్రహ్మణ్యశర్మ. ఈమధ్యనే పరిచయమయ్యారనుకో. ఎదురుగా వుంచుకునే చెప్పడం మంచిది కాదుగాని చాలా మంచివారని ఈ కొద్ది రోజుల్లోనే తెలుసుకున్నాను." ఈ పరిచయ వాక్యాలతో తన బాధ్యత తీరిందన్నట్టు రాంబాబు అతనితో సావకాశంగా మాటల్లోకి దిగాడు.

మధ్య మధ్య అయన బోసినోటితో నిండుగా నవ్వుతోన్నాడు. బొద్దుగావున్న శరీరం. గోచీపోసి కట్టిన తెల్లని పంచె, పల్చని లాల్చీ లోంచి పొట్టమీద స్పష్టంగా కనబడుతోన్న సన్నని జందెం. భుజం మీద ఎర్రని అంచు పైకి వచ్చేటట్టు మడిచి వేసుకున్న అంగవస్త్రం. నుదుట చందనపు బొట్టు. సగానికి సగం నెరసినా నాజూకైన సిగ ముడి. సలక్షణమైన బ్రాహ్మణతేజం వుట్టిపడుతోన్న ఆకారం సుశర్మగారిది.

వినీ విననట్టు ఒకటీ అరా వాళ్ళ మాటల్ని వింటూనేవున్నా నిజానికి నేను వినడం లేదనే చెప్పాలి. ఆయనకీ, రాంబాబుకీ స్నేహం ఎలా కుదిరిందా అనే నేనప్పుడు ఆలోచిస్తోన్నాను. సమవయస్కుల మధ్యనేగాని స్నేహం అనురాగంగా వుండదనేది అందరూ అనుకుంటోన్న యథార్థం. కాని రాంబాబు ఆయనతో నేస్తంకట్టి కొంతలో కొంతగా ఆ మాటని సవరించాడు. పైపెచ్చు ఆయనని 'మంచివారు' అని సర్టిఫై చేశాడు.

రాంబాబుతో నాకున్న స్నేహాన్నిబట్టి ఆ 'మంచి' అనే పదానికి

వాని దృష్టిలోవున్న అర్థాన్ని కూడగట్టుకున్నాను. ఫలితంగా తేలిన అంశం ఇది.

ఒక అందమైన గాజుబొమ్మని ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకుని, పొరపాటున జారవిడిచి, పగిలిన ఆ గాజుముక్కలకేసి చూస్తూ, అమాయికంగా ఏడిస్తే ఆ పిల్లవాణ్ని చేరదీసి "మా మంచి బాబువికదూ! పోనీలే...ఏడవకు. మరొకటి కొనుక్కుందాం" అని లాలించగలడు రాంబాబు. మరి ఈ సుబ్రహ్మణ్యశర్మగారుకూడా ఆ పిల్లవాని వంటివారేనా ? ఏమో!

"ఏమిటి? మీరేం మాట్లాడక్కూచున్నారు." శర్మగారు ప్రశ్నించారు నన్ను.

"మీరు మాట్లాడుతోన్నారుగా. అవే వింటోన్నాను." వెంటనే ఏం చెప్పాలో తోచక ఏదో వొకటి చెప్పకుంటే బావుండదు గనక అలా అన్నానతనితో.

"సరే, గుడికి వెళదామా? కపిలతీర్థంవైపు చూస్తూ సుశర్మ అడిగారు మమ్మల్ని.

"మరి వెళ్లక! వచ్చిందే అందుకయితే" పచ్చి అబద్ధం చెప్పాడు రాంబాబు. అయినా ఎదుటి వ్యక్తినీ, పరిస్థితినీ అర్థం చేసుకుని ఎవరిని ఎలా సంతృప్తిపరచాలో అన్నదికూడా ముఖ్యమేనని అనిపించింది నాకు—వాని మాటని విన్నతర్వాత. లేకుంటే గుడికి శర్మగారిలాంటి వాళ్లెందుకు వొస్తారో, మాలాంటి వాళ్లెందుకువస్తారో అందరికీ తెలిసిన విషయమే. భక్తితో రక్తిని అంత పొందికగా అదికించాడు రాంబాబు.

చేతుల కంటుకున్న ఇసుకని దులుపుకుంటూ లేచిన రాంబాబుతోటే నేనూ, శర్మా లేచి నడక సాగించాము.

ఆ రోజు సోమవారం. ముఖ్యంగా పున్నమి. ఆ పండువెన్నెలలో తిరుమల కొండల పరిసర ప్రాంతాలు ఎంత దివ్యంగా వుంటాయో నేనిప్పుడు మాటల్లో చెప్పలేను. అందుకనే ఏ సోమవారాన్నీ, ఏ పున్నమి రాత్రినీ విడిచిపెట్టకుండా నేనూ, రాంబాబూ ఆ వేళకి కపిలతీర్థాన్ని చేరుకుంటాం. అందులోనూ ఆ రెండూ కలిసొచ్చిన ఆ రోజున మా ఆనందానికి అవధులులేవు.

ఎవరికివాళ్లే మౌనంగా నడుస్తూ మేము ఇసుకబాట వదిలి, నీలగిరి చెట్లు దాటి ఆలయానికి చేరుకున్నాము

సుశర్మకైతే ఆ బెడద లేదుగాని మా కెదురయింది చెప్పుల ప్రశ్న! ఆలయ ప్రాంగణం వెలుపల, శిథిలమైన గోపురం ప్రక్క కాపలావున్న పిల్లవాడిదగ్గర నేనూ, రాంబాబూ చెప్పులు ఏడిచాము.

సుశర్మ సరాసరి వెళ్లి క్యూలో చేతులు కట్టుకుని నిలబడ్డారు. మేమూ ఆయన్ని అనుసరించాము.

అప్పుడే తిరుమలకు వెళ్లే కాలిదారి పొడవునా లైట్లు వెలిగాయి. చిన్న చిన్న అగ్గిపెట్టెల్లా దేవస్థానం బస్సులు అలిపిరినుండి మొదలయ్యే ఘాట్ రోడ్ వెంబడి వెళ్లివస్తోన్నాయి. అలా కొండ మొదట్లో నిలబడి. తల మీదికెత్తి మెలికలు తిరిగిన పాములాంటి ఆ రోడ్డువెంట ఎక్కడికక్కడ మలుపులు తిరుగుతో పరుగెత్తే బస్సులని చూస్తే ఎవరికైనా గుండెలదిరిపోతాయి.

అంతకు వారంరోజులముందే వర్షాలు పడడంవల్ల కపిలతీర్థంలో సన్నగా జల పడుతోంది. రాళ్లమీద దొర్లుకుంటోవచ్చి అంత ఎత్తునించీ దూకడంవల్ల కలిగే శబ్దం లయబద్ధంగా వినవస్తోంది.

క్యూ కదిలింది. కొంతసేపటికి గర్భగుడిలో ప్రవేశించాము, సర్ణ కవచంతో కప్పిన శివలింగాన్ని నాగుమల్లి పువ్వులతో అలంకరించారు.

సుశర్మగారు భక్తితో తీర్థాన్ని పుచ్చుకున్నారు. విభూదిని తీసుకుని కనుబొమలమధ్యా, కంఠానికీ రాసుకున్నారు. మావేపు చూశారు తీర్థం, ప్రసాదం మాకూ తప్పిందికాదు!

అలాగే ఆ గుడి పక్కనేవున్న అమ్మవారి దర్శనం చేసుకుని, నవగ్రహాల గుడిమీదుగా వెలుపలికి వచ్చాము. మెట్లు దిగి కోనేటి గట్టును చేరుకున్నాము.

తెల్లగా, పురవడిగా అంతర్లయతో దుముకుతోంది జలపాతం. ఆలయానికి నడుమున్న వేపచెట్టుమీద తనలో తానే కువకువలాడుతోంది నెమలి. కోనేటి నీళ్లలో ప్రతిఫలించి చేపపిల్లల్లా మిలమిల మెరుస్తోన్నాయి గోపురంమీది లైట్ల వెలుగులు. అందాన్ని అలంకరించిన గర్వంతో పిల్లగాలికి రెపరెపమంటున్నాయి రంగురంగుల చీర కొంగులు!

వీటివన్నింటినీ పాలవంటి వెన్నెలతో అభిషేకించి తన సౌందర్య సేవా పరత్వాన్ని సార్థకపరుచుకుంటోన్నాడు పున్నమి చంద్రుడు!

ఆ దృశ్యాన్ని చూచి, మైమరచి ఏ మా రాంబాబులాంటి వాళ్లో "ఎగ్జిబిషన్ ఆఫ్ బ్యూటీ" అని ఎగిరి గంతేసినా అందుకు ఆశ్చర్యపోనక్కర్లేదు మనం. అయినా ఆ రోజున అంతటి మా ఆనందానుభవానికీ మే మెక్కువసేపు నోచుకోలేకపోయాం. ఏదో ఆలోచ

వలో కలవొంచుకుని నడుస్తోన్న శర్మగారినే అనుసరించవలసొచ్చింది.

అలా ఆ శిథిలాలయాన్ని దాటి ఆయన వెనకాలే రెండడుగులు వేశానో లేదో రాంబాబు ఠక్కున నా జబ్బ పుచ్చుకుని నిలేశాడు. నాకు మాత్రమే వినిపించేట్టు "చెప్పాల్రా నాయనా! చూపులు శివుడిమీద, చిత్తం చెప్పులమీద అన్నది సరికొత్త సామెత. వాటినే మరిస్తే ఎలా?" అంటూ నన్ను వెనక్కి మళ్లించాడు.

మళ్లీ వెనక్కి వెళ్లి, కాళ్లకు చెప్పులు తొడుక్కుని ఆయన్ని కలుసుకున్నాము. మామధ్య ముసురుకున్న ఐదారు నిమిషాల మౌనం మమ్మల్ని నింపాదిగా ముందుకు నడిపింది.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో స్పష్టంగా వినవస్తోన్న మా కాలి చెప్పుల టకటకల్నే వింటోన్నట్టుగా కాసేపు నేలకేసి చూసి సుశర్మ గారిలా అన్నారు: "పోయాయి రాంబాబూ! ఆ మంచిరోజులు ఇకరావు."

మొట్టమొదట తగ్గు స్థాయిలో ప్రారంభమై మెల్లగా గళం విప్పుకుని వినవచ్చిన ఆ మాటల్ని "ఇంతసేపూ మథనపడినవి విష యాన్నే వెళ్లగక్కే వుద్దేశంలో ప్రథమ ప్రయత్నం చేస్తోన్నారీయన" అని అనుకున్నాను నేను.

అదేమిటో అర్థంకానట్టు రాంబాబు ఆయనవైపు చూశాడు.

"అవును రాంబాబూ! దైవభక్తి, పాపభీతి వున్న ఆరోజులు వెళ్లిపోయాయి. చూడండి బాబూ! మిమ్మల్నొక టడుగుతాను. సంకోచించకుండా సూటిగా సమాధానం చెప్పండి. దేవునిమీద నమ్మకం వుందా?"

ఈ ప్రశ్నకు సమాధానం నానుంచే వినాలన్నట్టుగా ఆయన నన్నే ప్రత్యేకించి చూస్తో అడిగారు. నేను విభ్రాంతుణ్నయ్యాను.

ఎందుకంటే అప్పుడు మేమున్న ఆ వాతావరణంగానీ, అంత వరకూ రాజ్యంచేసిన శర్మగారి మౌనంగానీ వారిచేత అలాంటి ప్రశ్నని వేయిస్తుందని నేనెదురు చూళ్లేదు. అందునా ఆ ప్రశ్నా అంతటి చిక్కు ప్రశ్నే!

నాలో కలకలం బయలుదేరింది.

దేవునిమీద నమ్మకం లేదనడం ఆధునిక నాగరికతకొక గుర్తు! దేవుడున్నాడని నమ్మి పూజలూ, పునస్కారాలూ చేసేవాళ్ళంతా అనాగ రికులకిందే లెక్క. తనదైన వ్యక్తిత్వాన్ని మరుగుపరుచుకుంటో, సంఘానికి కావలసిన వ్యక్తిత్వాన్ని ప్రచారం చేసుకుంటో బతికే విద్య ఈ రోజుల్లో దాదాపు అందరికీ అలవడింది. నిజానికి శర్మగారు నన్నడిగిన అదే ప్రశ్నని ఆలోచనా సరళిలో ఇండియాని మరో వెయ్యేళ్లు ముందుకి తీసుకుపోతున్నామని చాటుకునే పెద్ద మనిషినే గనక అడిగితే ఆయన బ్రహ్మాండమైన ఫోజొకటి కొట్టి "అసలు దేవుడంటే..." అనో, మరింకో రకంగానో డొంక తిరుగుడు సమాధానాన్నివ్వడానికే మార్గాల్ని వెదికేవాడు. అలా కాకుండా ఆ ప్రశ్న వున్నంత సూటిగానే నా సమాధానమూ వుండాలని తిన్నగా శర్మ గారితో ఇలా అన్నాను:

"మీరడిగిన ప్రశ్న మాలాంటి కుర్రవాళ్ళు సమాధానం చెప్ప దగిందికాదు శర్మగారూ! ఇక్కడ జవాబు చెప్పదగిందికాదు అని నేనం టోన్నానంటే ఏదో ఒక సమాధానం చెప్పలేమనికాదు. కానీ ఆ చెప్పిన దానికీ, మా ఆచరణకీ సంబంధం వుండాలి గనక చెప్పలేకపోతోన్నాను. పోతే మతమూ, దేవుడూ అనేవి అసలు మానవ జాతినే విడిచి వెళ్ళి వేమో అనిపిస్తోంటుంది నాకు. ఏ దేశ భాషా సంస్కారాలవల్ల మతం మౌఢ్యమనీ, ఆస్తికత్వం అనర్థ కల్పనమనీ మనం గుర్తించగలిగామో ఆ దేశాలే, ఆ దేశభాషా సాహిత్యాలే వాని తాలూకు అవశేషాల్నిప్పటికీ పట్టుకుని ఇంకా వేళాడులోనే వున్నాయి. తమ మత ప్రచారంకోసం చేతనైనంత ప్రయత్నాలూ చేస్తోన్నాయి."

చెబుతోన్న మాటల్ని ఆపి శర్మగార్ని చూశాను. ఆయన నో


**ఆంధ్ర సచిత్ర వార పత్రిక**

**— చందా వివరాల —**

**విడి ప్రతి వెల ... 0-60 పైసలు**

| | వ్యాన్ ఏజంటుద్వారా | పోస్టుద్వారా |
|---|---|---|
| | రు. పై. | రు. పై. |
| సంవత్సర చందా | 31-20 | 33-80 |
| అర్ధ సంవత్సరం | 15-60 | 16-90 |
| మూడు మాసములకు | 7-80 | 8-45 |

మేనేజరు
ఆంధ్రపత్రిక

ధానంగానే వింటో, ఆలోచిస్తోన్న వారిలాగానే కనిపించారు. అలాగే రాంబాబువేపూ ఓమారు చూసి మళ్ళీ చెప్పడం ప్రారంభించాను.

"నన్నడిగితే శర్మగారూ! తొలినాళ్లలో మనిషి ఏం చేసినా సంఘాన్నీ, దాని భద్రతనీ దృష్టిలో వుంచుకునే చేశాడు. దాని ఫలితమే ఈ పాపపుణ్యాలూ, దేవుడూను. ఎక్కడో చదివాను, మనిషి చేసిన ఒకే ఒక్కమంచిపనీ దేవుడున్నాడని కల్పించడమే–అని. ఇక్కడ మనం 'కల్పించడం' అన్నదాన్ని గుర్తుంచుకోవాలి. మరి మన కాలంలో సంఘపరంగా సంస్కర్తలని పేరుపొందినవాళ్లు వ్యక్తిగతంగా ఆధ్యాత్మిక చింతనలోకి పడిపోతోన్నారు చివరికి. అంటే సంఘ సంస్కరణకీ, ఆధ్యాత్మిక చింతనకీ ముడివేస్తోన్నానని మీరనుకోకండి. ఏది ఏమైనా 'ఇది ఇలాగ' అని తేల్చి చెప్పడానికి మా అనుభవమూ, వయసూ చాలవు. అర్థాంతరంగా ఈ ప్రసక్తిని ఇలా నిలుపుతోన్నందుకు దయచేసి మమ్మల్ని మన్నించండి."

అభ్యర్థనగా శర్మగారివేపు చాచిన నా చేతిని పట్టుకుని లాలనగా ఆయన అన్నారు: "లేదు బాబూ! నీకు తగినంతలో చెప్పిన నాలుగు మాటలూ మంచిమాటలే చెప్పావు. ఈ తరం కుర్రకారులో ఇలాంటి ఆలోచనే లేకపోతోంది. ఇంతకూ నా బాధేమిటంటే బాబూ! కాలం చాలా మారిపోయింది. అసలు నాకు తెలిసే ఈ తిరుపతిలో ఎంత మార్పు! నాకు వుపనయనం అయిన దగ్గర్నుంచీ నేనీ వూళ్లోనే వుంటోన్నాను. మా తండ్రిగారీ వూళ్లోనే పూజారిగా వుండేవారప్పుడు. నేను ప్రతిదినమూ ఆయనతోటే పెందరాళే లేచి, చన్నీళ్ల స్నానంచేసి, మడిబట్టలతోనే గుడికెళ్లి దేవుని కర్చన చేసేవాణ్ని. అప్పుడీ ప్రాంతమంతా ఎంత భయంకరంగా వుండేదని! ఇదంతా ముళ్లకంపలు. బ్రహ్మజెముళ్ళు. సాయంత్రం అరయ్యేసరికల్లా గింయ్‌మని పురుగుల రొద. మరీ అమావాస్య రోజులయితే ఇహ చెప్పక్కర్లేదు. అలాంటి సమయాలో నూ నేనూ, మా తండ్రిగారూ కలిసి ఏ రోజూ వేళమించకుండా రెండు సంధ్యల్లోనూ పూజలు చేసేవాళ్లం. విశేషించి శనివారాలొస్తే కాలిదారినే కొండకెళ్లి వెంకటేశ్వరుని దర్శనం చేసుకుని వొచ్చేవాళ్లం. కాళ్ళకు చెప్పులుండేవికావు. ఆయన చెప్పేవారు 'శ్రీకృష్ణదేవరాయల్లాంటి మహాపురుషుడే పాదరక్షలు లేకుండా సంచరించిన పుణ్య ప్రదేశం నాయనా ఇది!' అని. అంతటి నిష్ఠా, శ్రద్ధా ఇప్పుడెవరిలో వున్నాయి బాబూ! ఇప్పుడు, ఈ తిరుమలకి విహార స్థలానికొచ్చి నట్టొచ్చేవాళ్లు తప్పితే పుణ్యస్థలానికొచ్చి నటొచ్చే వాళ్లెవరున్నారు? ఈ యాంత్రికమైన జీవనంలో అసలు విశ్వాసానికి తావెక్కడిది బాబూ!"

శర్మగారు నన్నూ, రాంబాబునూ పరకాయించి చూశారు.

రాంబాబు గొంతు సవరించుకున్నాడు. ఆయన చెప్పిన విషయాన్ని తనూ శ్రద్ధగా విన్నాడనేందుకు ఋజువుగా వుండాలని కాబోలు ఇలా అన్నాడు: "కనిపించే మనిషినే విశ్వసించని రోజుల్లో కనిపించని దానిమీద విశ్వాసం ఎవరికుంటుందండీ?"

శర్మగారి బోసినవ్వుమాత్రం మా మాటలమీద విశ్వాసాన్ని ప్రకటించింది. ఈ మాటల్లోపడి మేమెంతదూరం నడిచొచ్చామో మా కప్పటికే తెలిసింది.

తిరుపతినుంచి కపిలతీర్థం రోడ్డువెంబడి వెలిగే ట్యూబ్ లైట్లు పున్నమి వెన్నెలలో వెలవెలపోతోన్నాయి. ఆ రోడ్డుకు రెండు వేపులా కొత్తగా వెలసిన అనంద నిలయాలు మందమారుతానికి విడిదియిళ్లలా తలలూపుతోన్న పూలమొక్కలతో కళకళలాడుతోన్నాయి.

వాటినే చూస్తూ, నడుస్తోన్న నేను రాంబాబూ, శర్మా నా వెనకే నిలిచినట్టు గుర్తించి వెంటనే ఆగాను. రోడ్డుకు ఎడమ వేపునున్న భవంతికేసి చూపుతో అన్నారు శర్మగారు: "ఇదే మా యిల్లు రండి...కాసేపు కూచుని వెళుదురుగాని."

రాంబాబు నా చేతిని అందుకుని శర్మగారి వెనకే నన్ను నడిపించాడు. నేనా భవంతికేసే కళ్లప్పగించి చూస్తోన్నాను.

చాలా పెద్ద మేడ. దానిముందు ముచ్చటైన పూలతోట. పక్కనే పోర్టికోలో తళతళలాడుతో హుందాగా నిలిచిన ఆకుపచ్చని కారు. అన్నివిధాలా 'ఖరీదు' కనిపిస్తోన్న బంగళా. అధునాతన పద్ధతుల్లో పొందికైన గృహాలంకరణ!

దాన్నలా చూస్తోండగానే మేడమీది అంతస్తులో లైటు వెలిగింది. దానితోటే ముందున్న గ్లాస్‌డోర్‌మీద అందమైన అమ్మాయి నీడ పడింది. తెల్లని పాలరాతి మందిరంలో తనకు తానై వెలిసిన సౌందర్య దేవత నల్లని కంచువిగ్రహంలా ఆ అద్దాల మేడలో ఆమె నీడ !

ఎత్తిన తలని దించి రాంబాబువైపు చూశాను. నా మనసుని చదివినట్టు శర్మగారు నవ్వుతూ అన్నారు. "ఆమె నా కూతురు. ఏడాది క్రిందటే పెళ్లయింది. అల్లుడు అమెరికా వెళ్లొచ్చాడు. మెడిసన్‌లో కార్డియాలజీ స్పెషలైజ్ చేశాడు. నాకున్నది ఆమె వొక్కతే గనక అల్లుణ్నిక్కడికే రప్పించుకున్నాను. రండి పరిచయం చేస్తాను."

ముందు నడుస్తోన్నారు శర్మగారు.

రాంబాబుతో కలిసి నడుస్తూ, స్టేట్స్‌కి వెళ్లొచ్చిన ఆ అల్లుణ్ని తల్చుకుంటో, ఆ అద్దాల మేడనీ ఆ శర్మగారినీ మార్చి మార్చి చూసుకుంటో అప్రయత్నంగా నాలో నేనే అనుకున్నాను.

"అవును. కాలం మారిపోయింది".